ఆచార్య జయశంకర్‌కు వీసీ అభినందనలు


ఆచార్య జయశంకర్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: బెస్ట్ రేర్ ఎర్త్ ఔట్‌రీచ్ అవార్డు అందుకున్న ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం విశ్రాంత ఆచార్యులు సీకే జయశంకర్‌ను వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ అభినందించారు. సీకే జయశంకర్ గురువారం వీసీని ఎస్వీయూ వీసీ చాంబర్‌లో కలిశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజిక్స్ హెడ్ విజయలక్ష్మి, ఆచార్య దేవప్రసాద్ రాజు పాల్గొన్నారు.


పూలు, అరటి పిలకలను కొనుగోలు చేస్తున్న ప్రజలు


తుడా రోడ్డులో సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు


పూలవీధిలో దుకాణాల వద్ద ప్రజల సందడి

వరలక్ష్మి వ్రతానికి వేళాయె..

తిరుపతి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పూజ సామగ్రి, వ్రతానికి సంబంధించి వస్తువులను కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దీంతో తిరుపతి నగరంలోని గాంధీరోడ్డు, కృష్ణాపురం ఠాణా, తుడా రోడ్డు ప్రాంతాలు కిక్కిరిశాయి. ఈ సందర్భంగా పూలు, అరటి పిలకలు, అమ్మవారి ప్రతిమలు, ప్రమిదలు తదితరాలను కొనుగోలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గణేష్‌కు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆర్థిక సాయం


గణేష్‌కు నగదు అందజేస్తున్న చిలమంద హరిక్రిష్ణ, బైరెడ్డి రమేష్, దయాకర్

తిరుపతి మంగళం: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళం ఎంపీటీసీ లక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు గణేష్‌కు గురువారం తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.30 వేలు సాయం అందించారు. ఆయన రెండు రోజుల క్రితం గణేష్‌ను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళం పంచాయతీ అధ్యక్షుడు చిలమంద హరిక్రిష్ణ, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్, నాయకులు జయప్రకాష్, వార్డు సభ్యులు దయాకర్, గోపి, చందు ద్వారా గణేష్‌కు డబ్బు అందజేశారు. అలాగే వార్డు మెంబర్ దయాకర్ గణేష్‌కి రూ.5 వేలు సాయం చేశారు.

వెంకట వినీత్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి పి.వెంకట వినీత్ డాక్టరేట్ పొందారు. ఆయన ప్రొఫెసర్ ధర్మారెడ్డి పర్యవేక్షణలో ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ పర్‌ఫార్మెన్స్ ఆఫ్ నానో పార్టికల్ డిస్పర్స్ ఫేజ్ చేంజ్ మెటీరియల్ యూజ్డ్ ఫర్ థర్మల్ ఎనర్జీ స్టోర్ అనే అంశంపై పరిశోధన చేశారు.

విశ్వనాథ్‌కుమార్‌కు..



ఎస్వీయూ సాంఖ్యక శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి పి.విశ్వనాథ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఆయన ప్రొఫెసర్ బి.సరోజమ్మ పర్యవేక్షణలో ఫ్రంటైర్ ప్రొడక్షన్ ఫంక్షన్ మోడల్స్ ఫర్ మెజూరింగ్ బ్యాంకింగ్ ఎఫిషియన్సీ అనే అంశంపై పరిశోధన చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించారు.

సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రాజకీయ తరగతులు నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ తెలిపారు. స్థానిక ఐటీఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం పీడీఎస్‌యూ జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 8వ తేదీన పీడీఎస్‌యూ నిర్మాత జార్జిరెడ్డి స్వగ్రామమైన చల్లావారిపల్లె నుంచి ఎస్వీయూనివర్సిటీ వరకు జార్జిరెడ్డి స్మారక బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇందులో జార్జిరెడ్డి సహచరులు ప్రదీప్, జార్జిరెడ్డి సినిమా హీరో, డైరెక్టర్ హాజరవుతారని తెలిపారు. కేంద్రం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిషత్ కార్యాచరణ రూపొందించడం కోసం రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇస్కాన్‌ను సందర్శించిన సినీ నటుడు సుమన్


సుమన్‌ను సత్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: గోమాత మహా పాదయాత్ర సందర్భంగా తిరుపతికి వచ్చిన ప్రముఖ సినీ నటుడు సుమన్ గురువారం ఇస్కాన్ మందిరాన్ని సందర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఇస్కాన్ ప్రతినిధులు స్వాగతం పలికి శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు, భగవద్గీత అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలాపారాయణదాస్, ఇస్కాన్ ప్రతినిధులు, భాస్కార్ యాదవ్, డాక్టర్ నారాయణ గౌడ్, నాగవర్ధన్, సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు, రేపు సిటిజన్ ఔట్‌రీచ్ క్యాంప్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో శుక్ర, శనివారాల్లో సిటిజన్ ఔట్ రీచ్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిని పరిగణలోనికి తీసుకుని ప్రతి క్లస్టర్‌లో 50 ఇళ్లకు వార్డు సెక్రటరీలు, వలంటీర్లు, అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఆధార్, మున్సిపల్ కార్పొరేషన్ సర్వీసులతోపాటు వెల్ఫేర్ క్యాలెండర్ తదితరాలను వివరిస్తారని తెలిపారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


తిరుపతి రూరల్ పుదిపట్లలో పెళ్లి కానుక అందజేస్తున్న మోహిత్‌రెడ్డి


చంద్రగిరి: పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పాకాలలో..

తిరుపతి రూరల్/చంద్రగిరి/పాకాల: తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీకి చెందిన నూతన వధూవరులు చాముండేశ్వరి, ఢిల్లీ బాబు, లావణ్య, భారతి, చంద్రగిరి పంచాయతీ దాసరవీధికి చెందిన నూతన వధూవరులు భార్గవ్, చందన, తొండవాడ పంచాయతీ అరుణకాలనీకి చెందిన దుర్గ, చందు, పాకాలలోని గాంధీనగర్‌కు చెందిన నూతన వధూవరులు తేజశ్విని, ఉమాశంకర్‌కు గురువారం ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపించారు. వాటిని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు.

రేపు పార్వతి పరమేశ్వరుల కల్యాణం

పాకాల: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

టీటీడీ చైర్మన్ భూమనకు కురబ కార్పొరేషన్ చైర్మన్ సత్కారం


టీటీడీ చైర్మన్ భూమనను సత్కరిస్తున్న కురబ కార్పొరేషన్ చైర్మన్, కురబ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్ / తిరుపతి అర్బన్: టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని గురువారం ఆయన స్వగృహంలో కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు కలిశారు. రెండోసారి టీటీడీ చైర్మన్ కావడంపై అభినందించారు. తిరుమలలో కొత్తగా నిర్మించే సత్రాలకు శ్రీవారికి భక్తుడైన కనకదాసు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అలిపిరి కూడలి లేదా కొత్తగా నిర్మిస్తున్న రోడ్ల కూడలిలో కనదాసు విగ్రహం ఏర్పాటు చేసి ఆయన పేరును నామకరణం చేయాలని కోరారు. టీటీడీ చైర్మన్‌ను సత్కరించిన వారిలో కురబ సంఘం ఉపాధ్యక్షుడు రెడ్డి కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మల్లయ్య, హరినాథ్, శంకరయ్య, రఘురాం, పోతయ్య, నాగసుబ్బయ్య, గౌతం, శివరామ్ ఉన్నారు. అనంతరం కురబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాష్‌బాబు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి కురబ కలస్తులు వస్తుంటారని, తిరుపతి-తిరుమలలో అతిథి భవనం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు పద్యపఠన పోటీలు


పోటీల్లో ప్రతిభ చూపిన పిల్లలతో దొడ్డా ఉమామహేశ్వర్

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో గురువారం గిడుగు వెంకట రామమూర్తి జయంతి వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు దొడ్డా ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పద్యం భావాన్ని తెలుసుకుని ఆచరిస్తే నిజ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. ఈ క్రమంలోనే వేమన, సుమతి శతక పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. పద్యపఠన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ నెల 29న నిర్వహించనున్న మాతృభాషా దినోత్సవంలో బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం వాగ్దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా హోదా కల్పించండి

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్స్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా హోదా కల్పించాలని అకడమిక్ కన్సల్టెంట్ల అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. వారు గురువారం వర్సిటీ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్‌తో సమావేశమయ్యారు. 110 జీవోను అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ అకడమిక్ కన్సల్టెంట్స్ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం మృతిచెందిన అకడమిక్ కన్సల్టెంట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

యానాదయ్యపై ఆరోపణలు తగదు

తిరుపతి కల్చరల్: ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్యపై అసత్యపు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగేంద్ర, రాష్ట్ర యువజన కార్యదర్శి రవిచంద్ర హెచ్చరించారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. యానాదయ్య రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు సోషల్ మీడియా, అడ్రస్‌లేని యూట్యూబ్ ఛానల్‌ను వేదికగా చేసుకొని అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. యానాదయ్య నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడిగా, బీసీ జేఏసీ కన్వీనర్‌గా పనిచేసి నాయీ బ్రాహ్మణుల సమస్యలను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. నాయీబ్రాహ్మణ కుల దూషణపై ప్రత్యేక జీవో తీసుకొచ్చి వారి రక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. అలాంటి నేతపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. మహేష్ సురేష్, చలపతి, పవన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ బ్రహ్మోత్సవాలు


కాలూరులో మాతమ్మ అమ్మవారి ఊరేగింపు

తిరుపతి రూరల్: సీమల్లవరం పంచాయతీ కాలూరులో మాతమ్మ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ఊరేగించారు. పోతురాజు ముగ్గు విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం అమ్మవారి కథ, రాత్రి జలగన్య పార్వతి కథ పారాయణం చేశారు.

విశ్రాంత అధ్యాపకుడు కోటేశ్వరరావు మృతికి సంతాపం

తిరుపతి సిటీ: ఎస్వీయూ పీజీ సెంటర్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు మృతి బాధాకరమని వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.